క్లుప్తంగా

స్వామివారి సేవలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసి నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు బుద్దు సతీష్‌శర్మ స్వామి వారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్‌ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మచిలీపట్నంటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పదో డివిజన్‌లో బుధవారం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పరాసుపేటలోని సువర్చలాంజనేయస్వామి వారి దేవస్థానం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ పాల్గొంటారని చెప్పారు.

రేపు సీతనపల్లిలో...


కృత్తివెన్ను: మండల పరిధిలోని సీతనపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పాల్గొని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

దివి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొక్కిలిగడ్డ



అవనిగడ్డ: దివి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోడూరు మండలం పిట్టల్లంకకు చెందిన కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు అగ్రికల్చర్ అండ్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవ్ చౌదరి నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైస్ చైర్మన్‌గా నాగాయలంక మండలం పర్రచివర శివారు పెదగాడపాలెంకు చెందిన వరికె ఏసయ్య, సభ్యులుగా 17మందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన పాలకవర్గాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు అభినందించారు.

వెంకటేశ్వరాలయ క్యాలెండర్ల ఆవిష్కరణ



గుడ్లవల్లేరు: భూ సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థాన నూతన క్యాలెండర్లను మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు మంగళవారం ఆవిష్కరించారు. మెయిల్ చైర్మన్ పామిరెడ్డి పిచ్చిరెడ్డి(పి.పి.రెడ్డి), రమా దంపతులు, మేఘా, మంజరి, పి.వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

సావిత్రి గౌరీ నోములు ప్రారంభం

కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలో తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో జరగనున్న సావిత్రీ గౌరి నోములు ముక్కనుమ మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. పురోహితులు జంధ్యాల పాండురంగశర్మ ఇంటి వద్ద విజయవాడకు చెందిన పురోహితులు జోశ్యుల శ్రీ హనుమంత కృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సామూహికంగా ముత్తయిదువలు నోములను నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున అమ్మవారి బొమ్మలతో మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం చేశారు.

బల్లిపర్రులో పశువైద్య శిబిరం

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి శివారు బల్లిపర్రు గ్రామంలో మంగళవారం కృష్ణా మిల్క్ యూనియన్, ఎన్టీఆర్ పశువైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 15 సాధారణ, 6 శస్త్ర చికిత్స, 85 గర్భకోశ వ్యాధుల పశువులను పరీక్షించి జీవాలకు నట్టల నివారణ మందులు అందజేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ సరైన యాజమాన్య పద్ధతులతో పశువులకు సకాలంలో చికిత్స అందించాలన్నారు.

ర్యాంపు నిర్మాణానికి నిధులు మంజూరు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

గుడివాకవారిపాలెం(అవనిగడ్డ): కృష్ణానదిలో ర్యాంపు నిర్మాణానికి రూ.4.50 లక్షలు మంజూరయ్యాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని త్వరలోనే నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వేకనూరు పంచాయతీ శివారు గుడివాకవారిపాలెంలో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక సమస్యలు, కరోనా కష్టకాలంలో కూడా ఏ ఒక్క సంక్షేమ పథకం ఆగకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకమైన పాలన అందిస్తున్నారని చెప్పారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం ఇస్తే ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళతారని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు మంచి జరిగేలా పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుంటున్నారని చెప్పారు.

ఈ సందర్భంగా పలువురు వృద్ధులు ఎమ్మెల్యే సింహాద్రిని ఆప్యాయంగా పలకరించి స్వాగతం పలికారు. మా బాధలు తీరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో మంచి పనులు చేస్తున్న మీరు మళ్లీ రావాలని కోరుకుంటున్నామన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ వర్రే నరేష్, గ్రామ కన్వీనర్ తుంగల వేణుగోపాలస్వామి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా, స్థానిక నేతలు చందన అంకినీడు, గుడివాక శ్రీమన్నారాయణ, బండే వసంతరావు, బండే వెంకటేశ్వరరావు, భరత్, గరికపాటి సుధాకర్, బండే సుబ్బారావు, నాగరాజు, గుడివాక మాధవి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ కలయిక



గురువులతో సంగముడి పాఠశాల పూర్వ విద్యార్థులు



గురువులతో భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

పెడన: భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–01 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగింది. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరు 23 ఏళ్ల తరువాత కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఆనంద పరవశులయ్యారు. విద్యాబుద్ధులు నేర్పిన పదకొండు మంది గురువులు తేజోవతి, సుభాషిణి, సరళాదేవి, కృష్ణకుమారి, మణి, ఉమాసరస్వతి, రమాదేవి, త్రిపురసుందరీదేవి, సాల్మన్‌రాజు, రామకృష్ణ, బషీర్ అహ్మద్, అబ్దుల్లా, నగేష్‌లను ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అభిలాష్, జగదీష్, బాలకృష్ణ, శ్రీనివాసరావు, లక్ష్మీకాంత్, మారుతీరావు, మంగారావు, క్రాంతికుమార్, అబ్దుల్‌సలాం, సురేష్, నీలిమా, ప్రశాంతి, బాలరజనీ పాల్గొన్నారు.

● కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలం సంగముడి ఉన్నత పాఠశాల 1995–96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక మంగళవారం అదే పాఠశాలలో జరిగింది. పాఠశాల ఆవరణను కలియ తిరుగుతూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకుని ఉద్వేగానికి గురయ్యారు.

ఈ సందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరహరశెట్టి రామ్మోహనరావు, కాయన సుబ్రమణ్యేశ్వరరావు, తోట రామ్మోహనరావు, తోట అంజలీదేవి, గుర్జిళ్ల అంజనేయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కన్న బిడ్డల కోసం తల్లి పోరాటం

మాజీ భర్త ఇంటి ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితురాలు శిరీష

కోనేరుసెంటర్: కన్న బిడ్డల కోసం ఓ తల్లి పోరాటానికి దిగింది. భర్త నుంచి తన పిల్లలను తనకు అప్పగించాలంటూ మంగళవారం అర్ధరాత్రి అతని ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. వివరాలు ఇవి.. అనంతపురానికి చెందిన శిరీషకు బందరు ప్రభుత్వాస్పత్రిలో కంటి వైద్యునిగా పనిచేస్తున్న డాక్టర్ భానుమూర్తితో 20 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. భానుమూర్తి పిల్లలు ఇద్దరిని శిరీషకు కనబడకుండా వేర్వేరు ప్రాంతాల్లో ఉంచి చదివిస్తున్నాడు. ఈ విషయంపై శిరీష అనేకమార్లు పోలీసులను ఆశ్రయించింది. స్పందనలో సైతం ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న ఎస్పీ బాధితురాలికి న్యాయం చేయాలని ఆ కేసును ఆర్‌పేట పోలీసులకు అప్పగించారు. పోలీసుల పంచాయతీ ప్రకారం శిరీష పిల్లలను ఈ నెల 17వ తేదీన ఆమెకు అప్పగించాల్సి ఉండగా భానుమూర్తి ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోయాడు. ఒప్పందం ప్రకారం శిరీష అనంతపురం నుంచి మంగళవారం మచిలీపట్నం చేరుకుంది. పోలీసులను కలిసి తన బిడ్డలను చూపించాలని కోరింది. రాత్రి అయినా భానుమూర్తి బిడ్డలను తన వద్దకు తీసుకురాకపోవడంతో శిరీష నేరుగా అతని ఇంటికి వెళ్లింది. ఇంటికి తాళాలు వేసి ఉండటంతో ఆవేదన చెందిన బాధితురాలు ఇంటి ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టింది. తన బిడ్డలను తనకు చూపించాలంటూ కోరుతోంది. విషయం తెలుసుకున్న చిలకలపూడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

పాండురంగ స్వామి ఆలయంలో భజనలు



పాండురంగస్వామి ఆలయంలో భజనలు చేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: స్థానిక చిలకలపూడిలోని పాండురంగస్వామి ఆలయానికి తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం కొమనగిరిపట్నానికి చెందిన భక్తులు మంగళవారం విచ్చేశారు. గ్రామంలోని ప్రహ్లాదబాబా ఆశ్రమానికి చెందిన వీరు పాండురంగస్వామి ఆలయానికి విచ్చేసి పాండురంగస్వామి కీర్తనలు, కృష్ణుడిపై పాటలు, భజనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు వాణీకృష్ణ, ఆదిరెడ్డి, బుచ్చిబాబు, లక్ష్మణరావు, ఈశ్వరరెడ్డి, సూరిబాబురాజు పాల్గొన్నారు.

నేడు నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

మచిలీపట్నంటౌన్: రుస్తుంబాదలోని భద్రాద్రి శ్రీరాములు వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి గోవాడ వెంకట కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా అనుముకొండ శ్రీధర్, ధర్మకర్తల మండలి సభ్యులుగా వేవ రామస్వామి, అశ్వధాటి పూర్ణచంద్రరావు, తాడివాక పద్మ, అలగలశెట్టి విజయ, కేశన బేబిసరోజిని, దిట్టకవి బాలశేష కృష్ణమాదార్యులు ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ పాల్గొంటారని చెప్పారు.


గ్రీన్ విలేజీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజిలో నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: కైకలూరులోని వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌ను మంగళవారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) హౌసింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీర్లతో కలిసి సందర్శించారు. లే అవుట్‌లో విద్యుత్ లైన్లు, ఇళ్ల నిర్మాణ పురోగతిని ఇంజినీర్లతో సమీక్షించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. కాలనీలో రెండువైపులా 40 అడుగుల రోడ్డు ముఖద్వారాల వద్ద నిర్మిస్తున్న ఆర్చిల నిర్మాణాన్ని పరిశీలించారు. ఎలక్ట్రికల్ డీఈఈ రామయ్య, హౌసింగ్ ఏఈ శేఖర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



తోట్లవల్లూరు: యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా ఆటల పోటీలు నిర్వహించటం అభినందనీయమని పమిడిముక్కల సీఐ ఎం. కిషోర్‌బాబు పేర్కొన్నారు. పెనమకూరులో భారత యువజన సంఘం ఆధ్వర్యాన కోడిపందేలు, జూదానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన 37వ వార్షిక సంక్రాంతి పోటీలు ముగిశాయి. మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం రాత్రి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. వాలీబాల్, షటిల్, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీల విజేతలకు సీఐ కిషోర్‌బాబు, ఆర్టీసీ రాష్ట్ర డైరెక్టర్ మర్రెడ్డి శిల్పారెడ్డి బహుమతులను అందజేశారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను పారిశ్రామికవేత్త తెల్లాకుల శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ ప్రదర్శన, డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శ్రీనివాసరావు, ఎస్‌ఐ జి. రమేష్, భారత యువజన సంఘం అధ్యక్షుడు మరీదు యోహాను, కార్యదర్శి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు హమాలీ చార్జీల చెల్లింపు

మంగళాపురం(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు హమాలీ చార్జీలు సకాలంలో చెల్లించిందని మంగళాపురం పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ వద్ద రైతులకు హమాలీ చార్జీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రైతుభరోసా కేంద్రం ద్వారా ఈనెల 6వ తేదీ వరకు ధాన్యం విక్రయించిన రైతులు 150 మందికి రూ.2,28,980 రాష్ట్ర ప్రభుత్వం అందించిందని నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ పర్సన్ కొర్రపాటి ముఖర్జీ, సొసైటీ సీఈఓ చంద్ర రవికుమార్, రైతులు చంద్ర వెంకటేశ్వరరావు, కిలారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

19న వేమన పద్య పోటీలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు పి.విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాలలో నగరంలోని అన్ని కళాశాలల విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి ఉన్న వారు గుర్తింపు కార్డులతో గురువారం ఉదయం 9 గంటలకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

సంస్కృతి పరిరక్షణే రామదండు ధ్యేయం



గూడూరు: భారతీయ సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణే ధ్యేయంగా రామదండును ఏర్పాటు చేస్తున్నామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ధన్వంతరీ ఆచార్య అన్నారు. మండలంలోని తరకటూరులో వీహెచ్‌పీ ఆధ్వర్యంలోని రామదండు సంస్థ తరకటూరు విభాగాన్ని ఆయన స్థానిక సాయిబాబా మందిరంలో ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించడంతోపాటు వారిని దైవ చింతన వైపు మరల్చేందుకు రామదండు దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో తరకటూరు ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, టీటీడీ ధార్మిక మండలి జిల్లా కార్యదర్శి తురగ ప్రసాద్, రామదండు వ్యవస్థాపకుడు, పూర్వవిద్యార్థులు యర్రంశెట్టి శివ, ముచ్చర్ల వరలక్ష్మి, కరుణ, రాధ, సతీష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లంక భూముల రైతులకు మేలు జరిగేలా చర్యలు

బందరు ఎమ్మెల్యే పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): నదీ పరివాహక ప్రాంతంలోని లంక భూముల్లో సేద్యం చేస్తున్న వేలాది మంది రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. లంక భూములకు సంబంధించి జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో చర్చించిన అనంతరం మంగళవారం పేర్ని నాని మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో ఆ ప్రాంత రైతులు సాగు చేసుకుంటున్నారని, వారికి హక్కులు కల్పించే విషయంపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లంక భూముల కేటగిరీలు మార్చేందుకు ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించిందన్నారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, రివర్ కన్జర్వేటర్లతో కమిటీ ఏర్పాటు చేసి భూముల కేటగిరీల మార్పుపై వచ్చే దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్‌కు సిఫార్సు చేయనున్నారని తెలిపారు. ఈ సిఫార్సుల ఆధారంగా కలెక్టర్ దీనిపై నిర్ణయం తీసుకుంటారన్నారు. వీటి కారణంగా లంక భూముల రైతులకు మేలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. గట్టుకు దగ్గరగా ఉండి, వరద వచ్చినా కొట్టుకుపోని భూమి ఎ-కేటగిరీగా, ఎ-కేటగిరీకి ఆనుకుని ఉన్న భూములను బి-కేటగిరీగా, నదిలో భూమి ఉండి వరదలు వస్తే పూర్తిగా మునిగిపోయే భూమిని సి-కేటగిరీగా విభజించారని చెప్పారు. సి-కేటగిరీ భూమిని అనుభవిస్తున్న రైతులకు ఐదు సంవత్సరాల లీజుకు ఇచ్చే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందన్నారు. అలాగే ఆరు లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా మునగని భూమిని కూడా లీజుకు ఇచ్చే ప్రతిపాదనపై గత నెల 30వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

సీపీఐ నాయకుడు బాబూరావు మృతి



రావి బాబూరావు (ఫైల్)

వక్కలగడ్డ(చల్లపల్లి): సీపీఐ ఉమ్మడి కృష్ణా జిల్లా సీనియర్ నాయకుడు రావి బాబూరావు (78) మంగళవారం వక్కలగడ్డలోని తన స్వగృహంలో మృతిచెందాడు. దివి ఏరియాలో సీపీఐ నాయకత్వాన జరిగిన అనేక భూ పోరాటాల్లో రావి బాబూరావు కీలక పాత్ర పోషించాడు. ప్రజానాట్య మండలి కళాకారుడిగా వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. దివి ఏరియా సీపీఐ కార్యదర్శిగా సుదీర్ఘ కాలం సేవలు అందించారు. చల్లపల్లిలో సీఆర్ వికాస కేంద్రం నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. బాబూరావు భౌతిక కాయాన్ని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అక్కాడ ప్రసాద్‌బాబు, ప్రజా నాట్య మండలి హైదరాబాద్ కార్యదర్శి హనుమానుల జగన్మోహనరావు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



నాగకార్తీక్ రెడ్డి మృతదేహం

గూడూరు: గూడూరు మండలం కంకటావ సమీపంలో ఈనెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పామిరెడ్డి వెంకట నాగ కార్తీక్ రెడ్డి (27) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గూడూరు గూడూరు హెడ్‌కానిస్టేబుల్ కమాల్ బాషా కథనం ప్రకారం.. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన కార్తీక్ రెడ్డి ఈనెల 15వ తేదీ రాత్రి స్నేహితులతో కలిసి సినిమా చూసేందుకు ద్విచక్ర వాహనంపై మచిలీపట్నం బయలుదేరాడు. గూడూరు మండలం కంకటావ గ్రామం దాటిన తర్వాత కార్తీక్‌రెడ్డి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో కార్తీక్‌రెడ్డి తలకు బలమైన గాయమైంది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతనిని స్నేహితులు బందరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కోమాలోకి వెళ్లిన కార్తీక్‌రెడ్డిని మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్తీక్‌రెడ్డి మంగళవారం మృతిచెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిప్రపత్తులతో అయ్యప్పల ఇరుముళ్లు



ఇరుముడితో శబరిమలకు పయనమైన మాలధారులు

కోడూరు: అయ్యప్ప మాలధారులు ఇరుముళ్ల కార్యక్రమాన్ని మంగళవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి 50 మంది మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం ప్రత్యేక వాహనంలో శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

ఆకట్టుకున్న రంగవల్లులు



బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలో మంగళవారం ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. రంగవల్లులు, మ్యూజికల్ చైర్, స్లో సైక్లింగ్ పోటీలు జరిగాయి. వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పి. వాసవి, ఆర్. లక్ష్మి, పి. కాంచనలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఐద్వా సంఘ నాయకులు రత్నకుమారి, ఎం. శ్రీనివాసరావు, ఎం. పద్మ, ఎస్. విజయలక్ష్మి, సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

పెదపారుపూడి: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణ పనులపై అధికారులు అలసత్వం వీడి పనుల్లో వేగం పెంచాలని హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ అధికారులను యాదేశించారు. మండలంలోని వెంట్రప్రగడ, ఈదులమద్దాలి గ్రామాల్లోని జగనన్న కాలనీ లేఅవుట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో నెలాఖారులోపు 70 శాతం ఇళ్ల బేసిమెంట్ పనులు పూర్తి చేయాలన్నారు. అధికారులు ఇళ్ల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

● మండలంలోని వెంట్రప్రగడ శివారు పూలవర్తిగూడెంలో ఇళ్ల నిర్మాణ పనులపై డీఆర్‌డీఏ పీడీ శివరాం ప్రసాద్ మంగళవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ వేగవంతం చేయాలన్నారు. బిల్లులు త్వరితగతిన లబ్ధిదారులకు చెల్లిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, పామర్రు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గాన్ని అనుసరించాలి



పెదమద్దాలిలో నూతన మందిర ప్రతిష్ఠ మహోత్సవంలో మాట్లాడుతున్న జ్ఞానమణి

పెదమద్దాలి(పామర్రు): క్రీస్తు మార్గాన్ని అందరూ అనుసరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. పెదమద్దాలిలో మంగళవారం సీబీసీఎన్‌సీ కల్వరి బాప్టిస్ట్ చర్చి నూతన మందిరం ప్రతిష్ఠా మహోత్సవం మంగళవారం నిర్వహించారు. జ్ఞానమణి మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి దయ క్షమ గుణాలను కలిగి ఉండాలన్నారు. పాస్టర్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేతనాలను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.